# నా తల్లో పీఠంవేసిన భూతం

భూతాలు ఎప్పుడు వస్తవో, ఎక్కడనుంచి వస్తవో వాటితో అనుభవం వున్న నాబోటి వాడికూ్కడా చెప్పటంకష్టం. ఇకరావులే అనుకున్నప్పుడు రావటంకద్దు. కనిపెట్టుకొని కూర్చున్నప్పుడు రాకపోవటం కద్దు.

అందులో నన్ను ముసురుకున్న భూతం మరీ విచిత్రమైంది. వొచ్చి ఎక్కడ కూర్చుంటుందో చెప్పలేం. వొకప్పుడు కుర్చీలో, వొకప్పుడూ నాకు ఎదురుగా, ఒకప్పుడు నా తలమీదా ఎక్కడపడితే అక్కడ కూర్చుంటుంది.

పోనీ నన్ను వదుల్తుందా అంటే వదలదు. నా దారిన నేను పోదామంటే పోనివ్వదు.

ఒకరోజు చూరులోనుంచి వొచ్చి నాకు ఎదురుగా కూర్చుంది. నేను నా మాములు ధోరణిలో రాసుకుంటున్నాను.

“నీకింకేం పనిలేదా?” అని అడిగింది.

“నాకు చేతైన పని ఇది వొక్కటే” అన్నాను.

“మొత్తానికి నువ్వు నాకు తగ్గవాడవే” అన్నది బూతం.

“ఏం?”

“ఉన్నది వున్నట్టు చెపుతావు.”

“అది చిత్రమా?”

“ఈ ప్రపంచంలో అంతకంటె చిత్రమైందేముంది?”

“పోనీలే అట్లాగే అనుకో”

“కాని నువ్వుపడే కష్టం అంతా వృథా”

“ఏం?”

"నువ్వు కాగితంమీద వాగటం తప్ప నీ మొర ఆలకించే దెవ్వరూ? పైగా నీ చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకోటానికి ఈ శ్రీరంగ నీతులు వ్రాస్తున్నావని అందరూ అనుకుంటున్నారు."

"ఆ విషయం నాకు తెలుసు నువ్వు చెప్పక్కర్లేదు" అని వొంచిన తల ఎత్తకుండా రాస్తుంటాను.

"ఏమి వ్రాస్తున్నావు?" అంటుంది భూతం.

"రాస్తున్నాను"

"ఏమిటి?"

"నా ఇష్టం వొచ్చింది."

"నీ ఇష్టం వొచ్చింది ఎవరిక్కావాలి? నా ఇష్టం వచ్చింది వ్రాయి" అంటుంది భూతం. ఆ మాట నాకు కొరడా దెబ్బ....

"నీ ఇష్టం వచ్చింది రాయటానికయితే నేనెందుకు? నెలకు ముప్ఫయి రూపాయిల జీతంమీద ఒక గుమాస్తాని పెట్టుకోరాదూ?" అంటాను.

ఈ మాటలకు భూతం కొంటెగా నవ్వుతుంది. ఈ భూతం వుందే-అది నవరస భరితం.

"కాదోయి, నువ్వే వ్రాయాలి. కాని నాకిష్టముందీ ఇష్ట మొచ్చిందీ వ్రాయాలి. నువ్వు బాగా వ్రాస్తావు. కాని, ఏ విషయం వ్రాయాలో, ఎలా వ్రాయాలో తెలియదు. అది నాకు తెలుసు" అంటుంది భూతం మీసం మెలిపెడుతూ.

"నాకు తెలియందీ నీకు తెలిసిందీ—ఏమిటా దేవ రహస్యం?"

భూతం సర్దుకొని, తృప్తిగా తనలో తాను నవ్వుకొని చెప్తుంది.

"సినిమాకి ఏం వ్రాస్తే డబ్బు వొస్తుందో నీకు తెలియదు. అంటే, మాబ్ అనేది వొకటి వుంది చూడు-దాన్ని ఆకర్షించేటట్టు రాయటం నీకు చాతగాదు. చదువుకున్న పదిమంది 'ఆహా!' అంటే చాలు? అసలే మనకు

ఫీల్డు చిన్నది. అరవలూ, కన్నడులూ, నైజాములూ—అందర్నీ ప్లీజ్ చేస్తేనే, మనకు నాలుగు డబ్బులు వొచ్చేది. పోనీ మన తెలుగు రాష్ట్రంలో చూద్దామన్నా పల్నాడూ, కైకలూరూ, రాయలసీమా మొదలైనవి వుండనే వుండే!

"ఇవన్నీ మనస్సులో పెట్టుకొని, మాబ్ ఎట్రాక్షన్ పెట్టు....బాగా పెట్టు" అంటుంది భూతం.

భూతం మాటలు నేను శ్రద్ధగా వింటాను? అది అంటే నాకు అసహ్యం అయినా, అది సినిమా పుట్టినప్పటినుంచీ ఈ ఫీల్డులోనే ఉంటూ వుంది గనకా—నాకు సీనియరుగనకా—నాది కూడా నేలవిడిచి సాముచేసే తత్వంకాదు గనకా—దాని మాటలు నేను శ్రద్ధగా వింటాను. దాని మాటలు విని; అర్థం అయినంతవరకు అర్థం చేసుకొని, వ్రాయటానికి ఉపక్రమిస్తాను.

కొంతంసేపు నన్ను తదేక ధ్యానంగా చూస్తూ, మెదలకుండా కూర్చుంటుంది భూతం. మళ్ళీ అడుగుతుంది. "ఏమి వ్రాస్తున్నావు?"

"మాబ్ ఎట్రాక్షన్"

"నీకు వేళాకోళంగా ఉందే!" అంటుంది భూతం. కనుబొమలు అర్ధచంద్రాకారంగా చేస్తుంది.

"అబ్బబ్బే?"

"ఏదీ! వ్రాసినంతవరకు చదివి వినిపించు"

"పూర్తి కానివ్వు."

"శాంపిల్ చూపు"

"ఈ పేరా పూర్తి కానివ్"

"నీతో వొచ్చిన చిక్కే ఇది. ఎడ్డెం అంటే తెడ్డెం అంటావు...."

నేను చదివి వినిపిస్తాను. ఆభూతం ఇంతంత కళ్ళు చేసుకొని శ్రద్ధగా వింటుంది. నాకు తృప్తిగా లేనిచోట సంతోషంగా ఎగిరి పడుతుంది, నేను గొప్పగా వ్రాశాను అనుకున్నచోట పెదవి విరుస్తుంది.

అది విని చివరికి, "పాత్రల మూవ్‌మెంట్, గత్రా, అవన్నీ వ్రాశావెందుకూ?" అని అడుగుతుంది.

ఈ ప్రశ్న నాకు కొరడా దెబ్బ....
"అవును. ఎందుకు వ్రాస్తావు" అని గద్దిస్తుంది భూతం
"మీ పాత్రలు కదలవా?" కోపం దిగమింగి ప్రశ్నిస్తాను.
"కాగితం మీద కదలవు" అంటుంది భూతం.

"మూవ్‌మెంటు వ్రాయకుండా సంభాషణలు రాయటం ఎలా? కూర్చొని మాట్లాడేటప్పుడూ, నడుస్తూ మాట్లాడేటప్పుడూ సంభాషణ ఒకే రకంగా వుండదు."
"అదంతా మేము చూసుకుంటాంలే"
"ఎప్పుడు?"
"సెట్లో."
"ఇప్పుడైతే!"
"అప్పుడు మనకు ఎటువంటి సెట్ దొరుకుతుందో!"

"సెట్ ఊహించుకునే నేను సీను వ్రాశాను ఎవ్వరైతే మట్టుకి సెట్ వూహించుకోకుండా సీను ఎట్లా వ్రాస్తారు?....ఇదిగో ఇక్కడ తలుపులు.... ఇక్కడ కిటికీ....ఇక్కడ [illegible].... ఇక్కడ కుర్చీలూ.... ఇక్కడపాత్రలూ...."

"చాల్లే, అవు" అంటుంది భూతం. "ఇప్పుడున్న స్టూడియో కన్డిషన్స్‌లో నీవు కోరినసెట్ దొరుకుతుందనుకొన్నా వేటిటి? సెట్ కోసం కూచుంటే, పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది."

"మరి ఏం చెయ్యాలి?"

"దొరికిన సెట్ ఎవెయిల్ చేసుకునేటట్టు రాయాలి. ఎవరన్నా వేసుకున్న సెట్లో ఒకరోజు సందు దొరికితే ముందు లాంగ్‌షాట్సు అన్నీ తీసుకుందాం. నెమ్మదిమీద డైలాగులన్నీ క్లోజ్‌షాట్స్‌లో, బ్యాక్‌గ్రౌండ్

టౌటాఫ్ షాట్స్ చేసి తీసుకుందాం. ఎడిటింగ్‌లో అన్నీ జాయిన్ చేసుకుం దాం....”

“అయితే నన్నేం చెయ్యమంటావ్?”

“నువ్వు సెట్ ఊహించుకో నక్కర్లేదు. మూవ్‌మెంట్ రాయ నక్కర్లేదు. ఒక్కొక్క పాత్ర పేరూ వ్రాసి దానికి ఎదురుగా డైలాగ్ వ్రాయి. ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడుపడితే అప్పుడు కొట్టెయ్యటానికి వీలుగా ఉండాలి.”

అని కొంతసేపు మెదలకుండా కూర్చుంటుంది భూతం. నేను రాస్తుంటాను. కాని కలం ఇదివరకంత జోరుగా నడవదు. మాటిమాటికి భూతం కనిపిస్తుంది. ఈసారి భూతం నా తలలో ప్రవేశించి కెలుకుతూ వుంటుంది.

భూతం నా తలలో పీఠం వేసుకొని అడుగుతుంది.

“ఎంతవరకు వ్రాశావు?”

“రాస్తున్నాను.”

“ఏదీ....?”

“ఎక్కువ రాయలేదు.”

“వ్రాసినంతవరకూ చాల్లే!” అని ఈసడిస్తుంది భూతం.

నేను చదివి వినిపిస్తాను.

“కలం కాగితం చేతులో వుందని ఇష్టం వొచ్చినట్టు వ్రాస్తే సరీ, ఆ డైరెక్టరన్నా యాక్టు చెయ్యగలరూ?” అని అరుస్తుంది భూతం.

“ఎందుకు చెయ్యలేరు? ధా....”

“ధా....క....మా....పీ....ఇవన్నీ నా దగ్గర చెప్పబాక. వాళ్ళు కావాలంటే ఒక్కొక్కళ్ళకి ఏభై వేలివ్వాలి. ఒక స్టార్‌కి ఏభై వేలుపోసి మనం తినేదేమిటి, గడ్డి” అంటూ నా తలమీద ఒక గుద్దు గుద్దుతుంది భూతం. తలలో చేరాగదా ఇక నేనేం చెయ్యగలనని దాని ధైర్యం.

"ఆ షాట్ తియ్యాలనేనా వ్రాసింది?" అని గుర్రురుముతుంది భూతం.

"కొంచం కష్టపడితే...."

"కష్టం అంటే డబ్బుతో పని, తెలుసా? ఆ షాట్ తియ్యటానికి నాలుగు గంటలు పడుతుంది. అంటే యాక్టర్ల జీతాలూ, అవన్నీ అట్లా పెట్టి, ఒక్క స్టుడియోకే అయిదువందల రూపాయలు అవుతుంది. ఇట్లా అయితే మనం పిక్చరు తీసినట్టే, డబ్బు చేసినట్టే!"

నాకు కంపరంపుట్టి, "అన్నీ అణా దమ్మిడీల్తో చూచుకుంటే ఎట్లా?" అని అడుగుతాను.

"మరి ఎందులో చూచుకోవాలంటావ్?"

"పిక్చరు బాగోగులు—"

"డబ్బొస్తే బాగున్నట్టే" అని తేల్చి "వ్రాయి" అంటుంది భూతం.

నేను రాస్తున్నాను. పైకి కనపట్టం లేదేమోగాని లోలోపల బాగా రగులుకుంటూ వుంది మంట.

"ఒకసెట్లో వొచ్చే సీన్లన్నీ ఎక్కువభాగం ఒకేచోట జరిగేట్టు వ్రాయి" అంటుంది భూతం.

"ఎందుకు?"

"లైటింగ్ మార్చకుండా, ఆ భాగాలన్నీ ఒకసారి కొట్టెయ్యొచ్చు" అంటుంది భూతం.

"యాక్టర్లకు కష్టం"

"కష్టం అయితే పడతారు."

"కన్టిన్యుటీ ఉండదు."

"మాబ్‌కి అవన్నీ అక్కర్లేదు." అని నాకు మాబ్ తరపున హామీ ఇచ్చి, "వ్రాయి, వ్రాయి." అని తొందర పెడుతుంది భూతం.

నేను రాస్తున్నాను.

"ఏదీ?" అడుగుతుంది భూతం. రాసినంతవరకు నేను చదివి వినిపిస్తాను.

"అదేమిటి నీ తలకాయ" అంటుంది నా తలకాయలో ప్రవేశించిన బూతం.

"ఏం?"

"మొదటి సీన్లో హీరో అత్తవారింటికి వెళ్దాం అనుకుంటాడూ! రెండో సీన్లో వెళ్ళేవుంటాడూ! ఆహాహా! ఏం రాశావోయ్! ఎప్పుడు వెళ్ళాడు? ఎట్లా వెళ్ళాడు? మొదలైనవన్నీ చూపక్కర్లా....మళ్ళీ మాట్లాడితే కన్టిన్యుటీ అని ఏడుస్తావే?" అంటుంది.

"మొదటి సీనులవగానే మిక్సుచేసి హీరోని అత్తవారింట్లో చూపితే అదే అర్థం...."

"మిక్సు కాదు- నీ టెక్నిక్ యెవ్వరికి కావాలోయ్, గాడిదగుడ్డు టెక్నిక్! మొదటి సీన్లో వెళదాం అనుకుంటాడు. తర్వాత ఏదన్నా ఒక సీను పెట్టు. కామిక్ సీనయితే బాగుంటుంది. దాని తర్వాత సీన్లో హీరో అత్తవారిల్లు ప్రవేశించినట్లు చూపు. మాబ్ కి చక్కగా అర్థమూ అవుతుంది. కామిక్ కి స్కోపు వస్తుంది."

"అక్కడ కామిక్ సీనుకి స్కోపులేదు"

"కామిక్ కి స్కోపేమిటి" అని వికటంగా నవ్వుతుంది భూతం. "అనుకున్న చోటల్లా పెట్టేదే! లేకపోతే డబ్బెట్లా వొస్తుంది"

"సీను ఒదులొదులుగా వుంటయి"

"ఉండనియ్"

"కథ నడకకి భంగం కలుగుతుంది"

"కథకి కాళ్ళులేవు అన్నారు మా పూర్వులు" అంటుంది భూతం. అని "వ్రాయి వ్రాయి" అని హెచ్చరిస్తుంది నా తల్లో పీఠం వేసుకున్న భూతం.

"నేను రాయను."

"ఎందుకని?"

"నా వల్లకాదు."

"బాగానే అవుతుంది" అని నాకు ధైర్యం చెపుతుంది నా తల్లో పీఠం వేసుకున్న భూతం.

"కాదంటూ వుంటే...."

"నువ్వు కాకపోతే నీ తల్లో జేజి వ్రాస్తుంది"

"అది రాస్తుంది"

"మరి నువ్వెందుకు వ్రాయవ్?"

"నా తల్లో జేజికి స్క్రిప్టు రైటర్ కావాలని ఇష్టం"

"నీకో"

"నాకు నేనుగా వుండటమే ఇష్టం"

"వ్రాస్తావా, వ్రాయవా?"

"రాయను"

"వ్రాయకపోతే ఏం చేస్తానో తెలుసా? నువ్వు చాతగనివాడివనీ, అందరితోనూ పోట్లాడతావనీ, నిన్ను బుక్ చెయ్యటం కొరివితో తల గోక్కోవటమేననీ, ఇంకా అనేక అపవాదులు నీమీద ఈ ఫీల్డులో ప్రచారంచేసి, నీకు నీళ్ళు పుట్టకుండా చేస్తాను. నువ్వు యెక్కడనుంచి వచ్చావో అక్కడకు పంపుతాను" అని హుంకరిస్తుంది నా తల్లో పీఠం వేసుకొని కూర్చున్న భూతం.

"నీ చేతయింది చేసుకో"

ఈ మాటకు భూతం నాతల్లో నుంచి అమాంతంగా దూకి, నాకు యెదురుగానుంచొని "వ్రాస్తావా-వ్రాయవా?" అని గద్దిస్తుంది.

"రాయను"

"రాయవూ?"

"రాయను"

ఆ భూతం నా మీదకు ఒక్క ఎగురు ఎగిరింది. నన్ను గుప్పెట్లో యిరికించుకుంది. నాకు ఊపిరాడకుండా కంఠంనులిమింది. తరవాత యేం జరిగిందీ నాకు తెలియదు.

ఇప్పుడా భూతానికి అయిదు తలలు-పది నాలుకలు.

(1949 లో వ్రాసింది)